

# కృషితో నాస్తి దుర్భిక్షం

నాగయ్య, రామయ్య అన్నదమ్ములు. నాగయ్య కూతురు పద్మావతి, రామయ్య కూతురు సత్యవతి. అక్కచెల్లెళ్లు అనే బంధుత్వం కన్నా, స్నేహితురాళ్లుగా ఎంతో ఆత్మీయులుగా వుండే వారు.

జీవితంలో జరిగే సంఘటనలన్నీ దేవుడు ముందుగానే నిర్ణయించి ముఖానరాసి వుంచు తాడని నమ్ముతుంది పద్మావతి. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొని, తన స్వశక్తితో జీవితాన్ని చక్కదిద్దుకోవచ్చని సత్యవతి భావిస్తుంది.

అయితే యీ అభిప్రాయ భేదాలు వాళ్ల స్నేహానికి ఏ విధంగానూ ఆటంకం కాలేదు.

పద్మావతి తన మేనత్త కొడుకు కృష్ణయ్యను ప్రేమించింది, కాని కృష్ణయ్యకు ఆస్తిపాస్తులు లేని కారణాన, నాగయ్య యీ పెళ్లికి ఒప్పుకోలేదు.

"రహస్యంగా గుళ్లో పెళ్ళిచేసుకో. ఏర్పాట్లు అన్నీ నేను చేయిస్తాను. ప్రేమించిన వాడిని కాదని మరొకడిని పెళ్ళాడి ఆత్మను చంపుకోవద్దు", అని సత్యవతి, పద్మావతికి సలహా యివ్వబోయింది.

"దేవుడు నా ముఖాన అలా రాశాడు. నాకు బావను పెళ్లి చేసుకునే ప్రాప్తం లేదు", అంది ఎంతో నిర్లిప్తంగా పద్మావతి.

పట్నంలో కిరాణాకొట్టు నడుపుతూ బాగా సంపాదిస్తున్న తిమ్మయ్యకు, పద్మావతి నిచ్చి పెళ్లి చేశాడు నాగయ్య.

రామయ్య కూడా సత్యవతికి పెళ్లి చెయ్యాలని సంబంధాలు చూడసాగాడు. ఉన్న పొలాన్ని తన పెళ్లికి కట్న కానుకల కింద ఖర్చు చేస్తే, తర్వాత తమ్ముడు, చెల్లెలు ఎలా బతుకుతారని యోచించి, కట్నం లేకుండా పెళ్లి చేసుకోవడానికి ఎవరైనా సిద్ధపడితేగాని తను పెళ్లి చేసుకోను అని ఖచ్చితంగా చెప్పింది సత్యవతి తండ్రికి.

ఇలా వుండగా తీర్థయాత్రలకు వెళ్లి పడవ ప్రమాదంలో సత్యవతి తల్లీ తండ్రి మరణించారు.

తమ్ముణ్ణి, చెల్లెల్ని పోషించే బాధ్యత సత్యవతి మీద పడింది.

ఇటువంటి విపత్కర పరిస్థితికి బెంబేలు పడిపోక, ధైర్యంగా నిలబడి పొలం తనే దున్నించి, పంట వేయించింది. కాని పాలేళ్లు సరిగ్గా పని చెయ్యకపోవటంతో దిగుబడి సరిగ్గా రాలేదు. మరుసటి ఏడు కోతల సమయానికి తుపాను వచ్చి, పంటంతా పాడై పోయింది. పొలాన్ని నమ్ముకుని ఎన్నేళ్లు గడిపినా పైకి రాలేనని గ్రహించింది సత్యవతి. అంతేగాక తండ్రిపోయాక ఆమెకు రక్షణ లేకుండా పోయింది.

ఇక లాభం లేదని పొలం అమ్మేసి, పట్నంలో వుంటున్న మేనమామ వద్దకు బయలుదేరింది సత్యవతి.

అక్కడ పట్నంలో తిమ్మయ్య కిరాణా కొట్టు మంచి కూడలిలో వుండటం వల్ల అతని వ్యాపారం జోరుగా సాగుతూంది. అక్కడ వేరే కొట్టు ఏదీ లేనందువల్ల, ధరలు ఎక్కువ చేసి, వస్తువులు కల్తీ చేసి అమ్మేవాడు తిమ్మయ్య.

ఇలా వుండగా తిమ్మయ్యకు పోటీగా అదే కూడలిలో రాజయ్య అనే వ్యక్తి కిరాణా దుకాణం పెట్టాడు. రాజయ్య సరసమైన ధరలకు అమ్మటం, కల్తీలేని వస్తువులు యివ్వటం గ్రహించి జనం తమకు కావలసిన వస్తువులను అక్కడే కొనడం మొదలు పెట్టారు. కొద్ది కాలంలోనే రాజయ్య మంచి పేరు సంపాదించటమే గాకుండా, డబ్బు కూడా నిలవేసుకోసాగాడు.



రాజయ్య దెబ్బతో తిమ్మయ్య వ్యాపారం పూర్తిగా పడిపోయింది. రాజయ్య మీద తిమ్మయ్యకు ఈర్ష్యాసూయలు బయలు దేరాయి. ఎలాగైనా యీ రాజయ్యను పట్నం నుంచి తరిమి గొట్టించాలని పథకాలు వేయసాగాడు తిమ్మయ్య.

తను ఇంట్లో లేనప్పుడు తన భార్య పద్మావతిని బలవంతం చేశాడని న్యాయస్థానంలో ఫిర్యాదు చేశాడు తిమ్మయ్య. డబ్బు ఆశ చూపించి కొందరిని తప్పుడు సాక్ష్యం చెప్పడానికి కూడా అతడు ఒప్పించాడు.

న్యాయస్థానంలో తిమ్మయ్య భార్య పద్మావతి ఏడుస్తూ రాజయ్య తనను బలాత్కారం చేశాడనీ, యిరుగు పొరుగువారు వచ్చి కొట్టబోతే పారి పోయాడనీ న్యాయాధికారికి విన్నవించుకుంది. అలా చెప్పకపోతే ఆమెను వదిలి పెట్టేస్తానని తిమ్మయ్య యింట్లో ఆమెను బాగా బెదిరించాడు.

న్యాయాధికారి యువకుడు, చురుకైనవాడు, ఆయన సాక్షులను విచారించాడు. అంతకు ముందే తిమ్మయ్య వద్ద డబ్బు తీసుకున్న వాళ్లు, పద్మావతి చెప్పింది అక్షరాలా నిజమని సాక్ష్యం చెప్పారు.

రాజయ్యను చూస్తుంటే, అతడు అలా చేసే మనిషిలా న్యాయాధికారికి అనిపించలేదు.

"ఏమయ్యా రాజయ్యా! వాళ్లు తిరుగులేని సాక్ష్యం తీసుకువచ్చారు. పరాయి ఆడదాన్ని అల్లరి పెట్టడం నేరం అని తెలియదా?" అని సౌమ్యంగా అడిగాడు న్యాయాధికారి.

రాజయ్య న్యాయాధికారికి జవాబివ్వకుండా,



చిరునవ్వు నవ్వి, తలపాగా తీసేశాడు. పెట్టుడు మీసాలు లాగేశాడు. ముతక చొక్కా విడిచి పెట్టాడు. క్షణంలో స్త్రీగా మారిపోయాడు రాజయ్య! న్యాయాధికారి, న్యాయస్థానంలో గుమి గూడిన జనం ఆశ్చర్యపోయారు. తిమ్మయ్య భయంతో వణకిపోయాడు.

న్యాయాధికారికి ఆ స్త్రీ నమస్కరించి యిలా అంది. "అయ్యా నా పేరు సత్యవతి! హఠాత్తుగా తల్లీ, తండ్రీ చనిపోగా, తమ్ముణ్ణి చెల్లెల్ని పోషించాల్సిన బాధ్యత నా మీద పడింది. పొలం మీద భుక్తి గడవక, దాన్ని అమ్మేసి పట్నంలోని మేనమామ యింటికి వచ్చాను. ఆయన మమ్మల్ని ఆదరించకపోగా, మాతో బానిసల్లాగా చాకిరీ చేయించుకోసాగాడు. వయస్సు వచ్చిన ఒక ఆడపిల్ల ఒంటరిగా యీ లోకంలో బతకలేదని తెలుసుకున్నాను. అందుకే మగవేషం వేసుకుని రాజయ్యలా మారిపోయి, వ్యాపారం చేసుకుంటు న్నాను. ఈ తిమ్మయ్య ఎవరో కాదు! మా అక్క పద్మావతి భర్త."

తరువాత న్యాయాధికారికి సత్యవతి తన గురించి అంతా చెప్పుకుంది.

న్యాయాధికారి తిమ్మయ్యకు, తప్పుడు సాక్ష్యం చెప్పిన వాళ్లకు కఠినంగా శిక్షలు విధించబోయాడు. అయితే సత్యవతి అడ్డుపడి వాళ్ల తప్పులను మన్నించమని వేడుకుంది. తిమ్మయ్యకు గట్టిగా బుద్ధి చెప్పి పంపేశాడు న్యాయాధికారి. ఆ ఊళ్లో తిరిగి ముఖం చూపలేక, తిమ్మయ్య మరో ఊరు వెళ్లిపోయాడు.

మొదటినుంచి సత్యవతి మీద, ఆమె రాజయ్యగా వున్నప్పటినుంచి, అభిమానం కలి గింది న్యాయాధికారికి. అతనికి యింకా పెళ్ళి కాలేదు. సత్యవతి లాంటి ధైర్య సాహసాలు గల యువతి కోసమే ఎదురు చూస్తూ యింకా పెళ్లి చేసుకోలేదు న్యాయాధికారి.

ఇద్దరి భావాలూ ఒకటయినందువల్ల, సత్యవతి న్యాయాధికారిని పెళ్ళి చేసుకుంది. ఆమె కష్టాలు గట్టెక్కాయి.

